



నేను చచ్చిపోతాను.”

“ఎందుకు?”

“ఎర్రశారీ అమ్మాయి నా వైపు కన్నెత్తి చూడటంలేదు.”

“ఎవరు? రాధ అని చెప్పావ్. ఆ అమ్మాయేనా?”

అవునన్నట్లు తల ఆడించాడు నారూమ్మేటు నూకరాజు.

కేస్టాయిల్ తాగినట్టుంది వాడి ముహం.

నిజంగానే చచ్చిపోయేటట్టున్నాడు.

ఇప్పుడే ప్రేతకళ వాడి రూపాన్ని ప్పివేసింది.

“నువ్వు తొందరపడి చచ్చిపోకు. నేనున్నాను. రాధ పొగరు అణిచి నీ గాన్ని చేస్తాను. ఇది నిజం” వాడికి ధైర్యం చెప్పాను.

కిరసనాయిలు బుడ్డిలా వెలిగింది వాడి మొహం.

కృతజ్ఞతతో నావైపు చూశాడు.

ఆ రోజునించే రంగంలోకి దిగాను.

ఎర్రగీతల షర్టు-బ్లూకలర్ లైట్ పాంటు-టక్ చేశాను. జుట్టును కర్లింగ్స్ తిప్పాను.

రూమునించి బయటకు వచ్చాను.

రిక్షాపిలిచి ఎక్కి కూర్చున్నాను.

రిక్షా ముందుకుపోతుంది. వెనక్కి పోతున్నాయి ఆలోచనలు.

నూకరాజు రాధను ప్రేమించాడు.

మామూలుగా కాదు.

ఎవ్వరూ ప్రేమించలేనంతగా.

మరెవ్వరూ ప్రేమించుకోలేనంతగా.

చెట్టులో - పుట్టలో - గట్టులో రాధ రూపాన్ని చూసుకున్నాడు. మురిసి పోయాడు. సర్వం మరిచి పోయాడు.

కాని___

అంతా వన్ వే ట్రాఫిక్

రాధ అతన్ని ప్రేమించలేదు. ప్రేమించినట్టు - నటించనుకూడా లేదు. కనీసం చిద్విలాసంగానైనా నవ్వలేదు.

అదే నూకరాజు బాధ.

అతను చెప్పుకునే కన్నీటి గాథ.

అతని గుండెల్లో ఆరని జ్వాల.

దేవదాసువంటి, మజ్నూవంటి ప్రేమదాసు ఇంతటి అవమానాన్ని భరించగలడా? భరించలేదు.

రిక్షా బస్‌స్టాప్ దగ్గర ఆగింది.

కిందికి దిగాను.

రిక్షా డబ్బులు చెల్లించాను.

బెల్లు మోగించుకుంటూ పోయింది రిక్షా.

బస్‌స్టాప్ దగ్గర జనం చీమలపుట్ట.

వాళ్లలో నేనొకణ్ణి.

వాళ్ళలో రాధకోసం చూశాను.

కనిపించలేదు

నాకళ్ళు అటూ ఇటూ తిరుగుతున్నాయి.

ఎవరిముందు - ఎవరి వెనుక - ఎవరి పక్కనా-కనిపించలేదు రాధ.

రాలేదనుకున్నాను.

అనుకున్నాను. వెంటనే వచ్చింది- ఎటునించి వచ్చిందో తెలీదు.

నేను రాధను చూశాను.

కాని రాధ నన్ను చూడలేదు.

రాధ నాకెలా తెలుసని అనుకుంటున్నారేమో!

ఒకసారి నూకరాజు తన ప్రేయసి అని రాధను చూపించాడు.

పరీక్షగా చూశాను రాధ అందాన్ని-

చక్రాల్లాంటి కళ్ళు.

మిసమిసలాడే వొళ్ళు.

ఎర్రగా-బుర్రగా-అందంగా వుంది.

పొడిగా దగ్గాను.

నిజంగా దగ్గువచ్చి కాదు.

రాధ నావైపు చూడటంకోసం.

ఒక క్షణంసేపు చూసింది రాధ నావైపు.

ఆ క్షణంలో-ఆ చూపులో-ఎన్నో భావాలు.

మళ్ళీ చూడలేదు.

చూడకూడదని కాదు - చూడాలని లేక కాదు-చూడాలనే చూడలేదు. అదే పనిగా చూస్తే నేనేమనుకుంటానో అని.

గంగిరెద్దులా వచ్చి బస్‌స్టాపుకు వంద గజాల దూరంలో ఆగింది పొడుగాటి నల్లబస్సు.

ఎవరూ దిగలేదు.

అలాగని దిగేవాళ్ళు లేరనికాదు.

ఎక్కేవాళ్ళు దిగేవాళ్లని దిగనివ్వలేదు.

ముందు లేడీస్‌కు ప్రిఫరెన్స్.

రాధ ముందు ఎక్కింది.

తర్వాత మరో పెద్దమనిషి – తర్వాత ఇంకో చిన్నమనిషి.

తర్వాత మరికొందరు–ఆ కొందరిలో నేను–బస్‌లో ఎక్కాం.

బస్సులో ఇరుకు.

కొందరి మొహంలో విసుగు.

మరికొందరి మొహంలో వెలుగు.

స్పీడుగా పోతున్న బస్సుకు అడ్డంగా పరిగెత్తుకొచ్చిన గుడ్డికుక్క.

సడన్ బ్రేకుతో బస్సు స్టాపు.

పెద్ద కుదుపు–ఆ కుదుపుతో ఒకరి మీద ఒకరు.

ఒకరు తిట్టుకుంటున్నారు – మరొకరు నవ్వుకుంటున్నారు.

బస్సు ఆగకుండాపోతే బావుండు–బస్సు మళ్ళీ సడన్ బ్రేకుతో ఆగితే బావుండు–ప్రయాణీకుల ఊహలు.

రాధమీదకు ఒరిగాను.

ముంగురులు నా బుగ్గలకు రాచుకున్నాయి.

ఏదో పరవశం.–

చక్కని చక్కిలిగింత.

వింత పులకింత.

మళ్ళీ బస్సు కదిలింది.

ఈసారి మళ్ళీ ఆగుతుందనుకున్నారు కొందరు ఆశావాదులు.

వారి కోరిక నెరవేరలేదు.

ఆగవలసిన చోటే ఆగింది బస్సు.

ఈసారి ఎక్కేవాళ్ళకంటే దిగే వాళ్ళఫోర్సు ఎక్కువ.

దిగేవారందరితో పాటు రాధ, నేనూ దిగాం.

కొంపలంటుకు పోతున్నట్టు ముందుకురికింది బస్సు.

ఎవరిదారిన వాళ్ళు వెడుతున్నారు.

రాధ దారిన రాధ.

నాకు దారిలేదు. రాధ వెనకే నడిచాను.

కొంత దూరం నడిచింది వేగంగా రాధ.

నేనూ అంత వేగంగానూ నడిచాను.

ఉమెన్స్ కాలేజీ దగ్గరవుతూంది.

ఉన్నట్టుండి–

నడుస్తున్నదల్లా – వెనక్కి తిరిగి చూసింది.

క్రాపు సరిచేసుకుంటూ కాలరు సర్దుకున్నాను.

అక్కడే నిలుచుండి పోయింది.

పక్కకు వెళ్ళాను–ఏం మాట్లాడాలో తెలీదు.

రాధ నవ్వింది.

ఆ నవ్వు–

నా గుండెల్లోకి కత్తిలా దూసుకు పోయింది.

నా తలమీద ఓ బుట్టెడు మల్లెపూలు కుమ్మరించినట్టుగా వుంది.

"మీరు ఎంతో అందంగా నవ్వుతారు" అన్నాను.

"మీరు అనవద్దు. నువ్వు అనండి."

ఉక్కిరి బిక్కిరయ్యాను.

"మీ పేరు?" వాలు చూపు విసిరింది.

"విష్ణుమూర్తి"

"అందమైన పేరు" "నా పేరు రాధ."

"నాకు తెలుసు."

"మీకెలా తెలుసు!" ముఖంలో ఆశ్చర్యం.

"మా ఫ్రెండ్ చెప్పాడు."

"మీ ఫ్రెండ్ ఎవరు?"

"నూకరాజు."

"అతనంటే నాకు ఒళ్లుమంట."

నాకూ ఒళ్ళుమండింది. కాని ఏమీ మాట్లాడలేకపోయాను.. వాడు రాధను అంత సిన్సియర్‌గా లవ్ చేస్తుంటే. ఇలా అంటుం దేమిటి?

ముందుకు అడుగువేస్తూ అన్నది_

"మీరంటే నా కిష్టం"_సిగ్గుతో.

కలో నిజమో అర్ధంకాదు. రాధకు నేనంటే ఇష్టమా!

"సాయంత్రం పిక్చర్ కెడదాం. నాజ్ అప్సరకురండి. మీ రొక్కరే. నూకరాజును తీసుకురావద్దు."

చకచకా నడిచి వెళ్ళిపోయింది.

స్థాణువులా నిలుచుండిపోయాను.

చివరికి ఎప్పటికో_రూముకు చేరాను.

"ఏమైంది?" ఆత్రుతగా అడిగాడు నూకరాజు.

వాడికేం చెప్పాలో అర్ధంకాలేదు.

"ఇంతవరకూ ఏం కాలేదు. నువ్వు తొందరపడి చచ్చిపోవద్దు"

వాడు మాట్లాడలేదు

ఎదురింటి కుంకుడు చెట్టుమీద వాలిన గుడ్లగూబను చూస్తున్నాడు.

ఎప్పటికో సాయంత్రమయింది.

త్వరత్వరగా డ్రస్ చేసుకున్నాను.

"ఎక్కడికి బయల్దేరుతున్నావ్?" అడిగాడు వాడు.

"ఒక ఫ్రెండ్‌ను కలవాలి."

బయటకు వచ్చాను.

రిక్షా ఎక్కి పది నిముషాల్లో నాజ్ అప్సరకు చేరాను.

నేను వెళ్లిన పదినిముషాలకు వచ్చింది రాధ చిలకలా_

ఇద్దరం థియేటర్‌లోకి వెళ్ళాం.

"మీరెంతో అందంగా వుంటారు... మీ కళ్ళంటే నా కిష్టం" నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది రాధ.

ఏదో హాయి ఫీలయ్యాను. రాధ చేతిని గట్టిగా నొక్కాను.

"నువ్వు దక్కకపోతే చచ్చిపోతా నంటున్నాడు నూకరాజు" రాధతో చెప్పాలని నోటి చివరవరకూ వచ్చింది.

కాని చెప్పలేకపోయాను.

పిక్చరు బిగినయింది.

తెరమీద హీరో హీరోయిన్‌లు పాట పాడుకుంటూ ఒకరి కౌగిల్లో మరొకరు ఇమిడిపోతున్నారు___నలిగిపోతున్నారు_ వాలిపోతున్నారు _ కరిగి పోతున్నారు_ ఒదిగిపోతున్నారు.

అప్రయత్నంగా_

కాదు ప్రయత్న పూర్వకంగా_

రాధ నడుము చుట్టూ చెయ్యిని పోనిచ్చాను.

ఎవరైనా చూస్తారేమో అన్న ఆలోచన రాలేదు.

కాదు వచ్చింది.

ఆ ఆలోచనను తరిమి వేశాను.

తెరమీద హీరో_హీరోయిన్.

తెరముందు_నేను రాధ.

ఆ క్షణంలో నూకరాజు గుర్తుకు రాలేదు.

కాదు_గుర్తుకొచ్చాడు.

దీనంగా _ అతిదీనంగా _ దీనాతి దీనంగా_

ఎదురుగా నిలుచున్నాడు.

"నాకు అన్యాయం చేస్తున్నావ్_ఇది మిత్రద్రోహం" ఇంకా ఎన్నో అన్నాడు.

అయినా అవేవీ నాకు వినిపించలేదు.

వనిత తనంతట తానే వలచిన...

అవును. రాధ నన్ను వలచింది.

మనస్ఫూర్తిగా ప్రేమించింది.

తన హృదయాన్ని అర్పించింది.

తనువును సమర్పించటానికి సిద్ధంగా వుంది.

అటువంటప్పుడు తను రాధ ప్రేమను స్వీకరించటం—

రాధ హృదయాన్ని తన హృదయంతో జాతీయం చెయ్యటం—

ఎంతమాత్రం అన్యాయం కాదు.

అన్యాయం ఎందుకు కాదు?

నూకరాజు నేను ఎంతటి ప్రాణ మిత్రులం.

ఒకసారి నాకు పెద్ద జ్వరమొస్తే— మూసిన కన్ను తెరవకుండా పడివుంటే— తనని కంటికి రెప్పలా చూసుకున్నాడు నూకరాజు. తనకోసం విలపించాడు. అన్నం, నీరు ముట్టలేదు.

అటువంటి నూకరాజుకు తను చేకూర్చే న్యాయం ఇదా?

పిక్చరు వదిలారు.

బయటకు వచ్చాం.

ఒక మలుపు దగ్గర ఇద్దరం విడిపోయాం.

విడిపోయేముందు రాధ నన్ను ముద్దు పెట్టుకుంది.

గేటు తోసుకొచ్చి రూము తలుపు తట్టాను.

తెరుమకోలేదు.

పైకి చూశాను. తాళంవేసి వుంది.

నూకరాజు ఎక్కడికి వెళ్ళాడు!

డూప్లికేట్ కీతో తాళం తీశాను.

లోపలకు వెళ్ళి లైటు వేశాను.

లైటు వెలుతుర్లో టేబుల్ మీద చిన్న కాగితం—దానిమీద ఏవో అక్షరాలు. చేతికి తీసుకున్నాను—

'మనసు బాగోక పిక్చరు కెళ్ళాను. అక్కడ రాధ-పక్కన మరో అతను. చూడలేక తిరిగొచ్చాను. బ్రతుకుమీద విరక్తి పుట్టింది. అందుకే నేను చచ్చిపోతాను.' —నూకరాజు.

రాధ పక్కన కూర్చున్నది నేనని నూకరాజుకు తెలీదా? లేక తెలిసే ఇట్లా రాశాడా?

ఛీ! తను ఎంతటి దురాత్ముడు—తన మూలంగా నూకరాజు ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. ఇద్దరు ప్రాణమిత్రులను విడదీసింది ఒక ఆడది—రాధ.

రాధ గుర్తుకొచ్చింది.

రాధ ఎంత అందంగా వుంటుంది! పెద్ద పెద్ద కళ్ళు—వెన్నెల నవ్వు. విడిపోయేముందు రాధ నన్ను ముద్దుపెట్టుకోటం గుర్తుకొచ్చింది. ఎంత పులకింత!

ఇప్పుడు నూకరాజు గుర్తుకురావటం లేదు. నా కనులముందు—రాధ.

ఒక్క నిముషంలో నా మెదడులో మారిపోతున్న ఎన్ని ఆలోచనలు?

నా మనసులో అలలుగా కదులుతున్న ఎన్ని భావాలు?

ఎప్పుడో "లింక్" చెప్పిన సామెత గుర్తుకొచ్చింది.

"హ్యూమన్ మైండ్ ఈజ్ లైక్ మంకీ—" ఇది నిజం. ★